# కుక్కిటంపం

"దేశ సమస్య అయితే కావచ్చు. నాకు మాత్రం ఇది పెద్దసమస్య అయి కూర్చుంది."

జానకి కళ్ళల్లో నీళ్ళు చూసేసరికి కమలకి జాలేసింది. నిజమే! జానకి అందరిలాంటి పిల్లకాదు. సౌమ్యమైన ప్రకృతి. ఇతరుల గొడవ పట్టించుకోకుండా తన సంగతేదో తను చూసుకుంటూ నెమ్మదిగా తలవంచుకొని పోయే తత్వం. ఎవర్నీ తను ఏమీ అనదు. ఎవరేనా తనని అంటే ఇలాగే బాధపడుతూ కళ్ళమ్మట నీళ్ళు తెచ్చుకుంటుంది.

మళ్ళీ జానకి చెప్పసాగింది.

"నేను పోనీ ఏద్రైనా వెకిలిగా ఉంటున్నానా చెప్పు. ఎందుకా మొగపిల్లలు నా వెనకాల పడడం? ఆ వెకవెకలూ పకపకలూ ఏమిటి? స్కూలుకి వెళ్ళేటప్పుడూ, ఇంటికి వచ్చేటప్పుడూ రక్షక దళంలా నన్ను ఇలా ఎందుకు వెంబడించడం?"

"పోనిద్దూ - చెంపకు చేరడేసి కళ్ళూ ముద్దులొలికే ముక్కూ-కోల ముఖం- పచ్చని మేని ఛాయతో ఆకర్షణీయంగా ఉన్నావేమో నీ వెనకాల పడుతున్నారేమో- అందరికీ ఈ అదృష్టంపట్టమంటే పడుతుందా? నా వెనకాల రమ్మను ఒక్కడు వస్తాడేమో".

"ఇది అదృష్టముటే ! ఇది అదృష్టమా? ఈ పీడ, పరాయి వాళ్ళకి కూడ వద్దు బాబు!"

కమల నవ్వి "పీడ అని నువ్వను కుంటున్నావు కాని పిరియమని కొందరభిప్రాయం-తెల్సా? ఏమైనా హైస్కూలు, అమ్మాయిలకి కాలేజి యువతులకి కాస్తో కూస్తో ఈ ఇబ్బంది ఉన్నదే. ఇష్టమైతే ఈ ఇబ్బంది ఒప్పుకునే చదవాలి. లేక పోతే ఇంట్లో కూచోవాలి" అంది.

"ఈ రౌడీలకి భయపడి చదువు మానుకోమంటావా?" పౌరుషంవచ్చి కోపంగా అడిగింది జానకి.

"లేకపోతే ధైర్యంగా ఉంటూ. వాళ్ళు వెంటపడితే పడ్డారని నిర్లక్ష్యంగా ఉండు. అంతగా శ్రుతి మీరితే హెడ్మాష్టర్‌కి రిపోర్టు చెయ్యి. ఇంకా వినరూ పోలీసు రిపోర్టు ఇయ్యి. "ఆడ పిల్లల వెనకాల తిరుగవు కదా" అంటూ పళ్ళు అన్నీ పీకి చేతిలో పెట్టి పంపిస్తారు. అదీ కాదన్నావు- నువ్వే ఒక మంచి ముహూర్తంచూసి నడి రోడ్డులో చెప్పు

తీసుకుని ఒకడి పళ్ళు ఊడగొట్టు. ఆ తర్వాత ఒక్కడు నీ వెంట పడితే ఒట్టు"-

జానకి ఆలోచనలోపడింది. తను ధైర్యంగా ఉండటం అనేది కలలోమాట. అసలే పిరికి గుండె తనది. హెడ్మాస్టారుకి చెప్తే 'అదిగో మామీద రిపోర్టిచ్చావా' అంటూ మరింత తెగిస్తారేమో. పోలీసులకి రిపోర్టివ్వడం మరింత అల్లరి చేసుకోవడమే అవుతుంది. మగ పిల్లాడిని పట్టుకొని బజార్లో లెంపలు వాయించడం తనవల్ల అయ్యే పనికాదు-మరెలా?

ఇంకేమిటి చెయ్యడం? చదువు మానెయ్యడమే! జానకికి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

టెంత్ క్లాసు పరీక్షలయ్యాక నాన్నగారు దగ్గరగా వచ్చి తలమీద చెయ్యి వేసి ఆప్యాయంగా నిమురుతూ "ఏమమ్మా ఇంకా చదువుకోవాలని ఉందా? నీకు ఇంత టితో చదువాపి పెళ్ళిచే సేస్తే, నా బాధ్యతా తీరుతుంది. ఆ లోకంలో ఉన్న మీ అమ్మా సంతోషిస్తుంది. ఏం?.... అలా చెయ్యనా? లేకపోతే ఇంకా చదువుకుంటావా?" అని అడిగినప్పుడు "ఇంక చదువుకోను. ఈ మగ పిల్లల అల్లరి ఆగడం భరించలేను" అని చెబుదాంఅని నోటిదాకా వచ్చింది జానకికి. కాని తండ్రి ఆప్యాయత చూసేసరికి కంఠం గద్గదికమై ఏమీ చెప్పలేక ఊరుకుంది.

అలా ఊరుకోవడమే మంచిదైంది. ఏమంటే, రిజల్ట్సు వచ్చినరోజున తనూ కమలా రోజంతా కలుసుకుని నవ్వు కుంటూ సరదాగా కబుర్లు చెప్పుకున్నారు. తర్వాత కాలేజీలో ఎవరు చేరుతారు. ఎవరు మానేస్తారు అని చర్చించుకోవ డంలో "నేను కాలేజీలో తప్పకుండా జేరతాను" అంది రోజా.

ఆశ్చర్యంగా జానకి రోజాకేసి చూసింది.

రోజా కూడా తనలాగే అందమైందే. కాని భగవంతు డిచ్చిన వరంలాంటి ఆ అందం తన పట్ల శాపం అయింది కాని రోజాపట్ల అలా కాలేదు. ఎందువల్లో తన వెనకాల పడినట్లూ, తనని ఏడిపించినట్లూ మగపిల్లలు ఆమె వెనకాల పడరు. ఆమెను హింసించనూ హింసించరు. ఈ సంగతి చాలా రోజుల నుంచి చూస్తోంది తను. అయితే కాలేజీ కుర్రాళ్ళుకూడా ఇలాగే ఉంటారని నమ్మకం ఏమిటి? రోజాకి ఈ సమస్య కాలేజీలో ఎదురైతే?

ఆ సంగతే రోజా నడిగింది జానకి. "హైస్కూల్లో అదృష్టంవల్ల తప్పించుకున్నావు. బాగానేవుంది. కాని కాలేజీలో అబ్బాయిలు ఏడిపిస్తారేమో ఆలోచించావా?" అని.

దానికి రోజా నవ్వి "నన్నేడిపిస్తారేం? - ఇదిగో మనకీ లైసెన్సు ఉంది" అంటూ మెడలోనున్న నల్ల పూసలుచేత్తో పట్టుకుని చూపించింది.

కమల నవ్వి "మన రోజాకి చిన్నప్పుడే పెళ్ళయి పోయిందికనక బతికి పోయింది. లేకపోతే, హైస్కూల్లో నిన్ను ఏడిపించిన కుర్రాళ్ళు దాన్ని ఏడిపించకుండా వదులు దురా? నువ్వుకూడా హాయిగా పెళ్ళి చేసుకుని కాలేజిలోచేరు. ఆ బెడద తప్పుతుంది" అంది.

కాలేజిలో చేరే ముందు పెళ్ళి చేసు కోవడం ఏమిటి? పెళ్ళి చేసుకుంటే ఇంక చదువు మానెయ్యడమే మంచిది. లేదా చదువు పూ_ర్తి అయేదాకా పెళ్ళి సంగతి తలపెట్టకుండా ఉండనేనా ఉండాలి-ఏవిటి చెయ్యడం? జానకికి మనస్సులో చదువు కోవాలనే ఉంది. కాని పెళ్ళి కాకుండా చదువుకుంటే కమల చెప్పినట్లు ఈ బెడద తప్పదు. ఎలాగ? ఏవిటి చెయ్యడం?

పోనీ పెళ్ళి అయినట్లు మెళ్లో నల్లపూసలు కట్టుకుంటే!

ఆ .. అవును అది బాగానే ఉంది. ఇంక మగ పిల్లలు తన జోలికిరారు. కాని ఉన్న ఊళ్లో ఎలా? ఎవరికి తెలియదు తనకి పెళ్ళయిందో లేదో. ప్చ్ లాభం లేదు. మరో ఊరు వెళ్ళితే ఈ నటన పని చేస్తుంది కాని, ఈ ఊళ్లో లాభంలేదు.

ఇలా జానకి నిట్టూర్చినంతసేపు పట్టలేదు. వారం తిరగకుండా వాళ్ళనాన్నగారికి గుంటూరు ట్రాన్స్ఫర్ అయింది. గుంటూరు వెళ్ళడం ఏమిటి, మెళ్లో నల్లపూసలు

పెట్టుకుని కాలేజీలో జానకి జేరడం ఏమిటి, రెండూ ఒకదాని తర్వాత మరియొకటి జరిగి పోయాయి.

దూరంనుంచి చూసిన అబ్బాయిలూ, దగ్గరకూచున్న అమ్మాయిలూ జానకి మెడచూసి 'ఈ అమ్మాయికి అప్పుడే పెళ్ళి అయిపోయిందర్రోయ్' అనుకుంటున్నప్పుడు "హమ్మయ్య?" అని స్వేచ్ఛగా గాలి పీల్చుకొంది జానకి. కాలేజీకి బయల్దేరేటప్పుడు మెళ్ళో నల్లపూసలు పెట్టుకోవడం తిరిగి ఇంటికి రాగానే తండ్రి చూడకుండా తీసేసి దాచెయ్యడం, ఇలా జానకి అతిచాకచక్యంగా ప్రవర్తిస్తూ, కాలేజీలో తనకి ఎదురవుతుంది అనుకొన్న భయంకరమైన సమస్య, ఎదురు కాకుండా తెలివిగా పరిష్కరించుకొంది.

విజిల్స్ వేసుకుంటూ హుషారుగా అల్లరిచేసే కుర్రాళ్ళు కూడా తననిచూస్తే మర్యాదగా తప్పుకుంటూ, సిటీబస్సులో ఎక్కేటప్పుడూ దిగేటప్పుడూ పెద్ద మనుష్యులులా తప్పుకొని చోటిస్తూంటే "ఎంతైనా మన సంఘంలో ఇంకా వివాహానికీ, వివాహిత అయిన స్త్రీకీ గౌరవం పోలేదు" అని అనుకొనేది జానకి.

ఒక్కొక్కప్పుడు ఎవరో ఒక కొంటె కుర్రాడు "అబ్బ! ఏం అందంరా! మెళ్ళో నల్ల పూసలుండి పోయాయి కాని లేక పోతేనా-హుఁ!" అనినప్పుడు, జానకి అప్రియత్నంగా మెడలో నల్లగా మెరుస్తూన్న కుత్తికంటు కేసి కృతజ్ఞతతో చూసేది.

కాలేజీలో చేరిన వారం రోజులకే, మళ్ళీ అచ్చు కమల లాంటి కల్పలతే, ఎంతో దగ్గరయి స్నేహితురాలయిపోవడం, జానకిమనస్సుకి కొంత ఆనందాన్నీ ఉత్సాహాన్నీ ఇచ్చింది. కమలకీ కల్పలతకీ ఎన్నో పోలికలున్నాయి. కమలలాగే ఈ కల్పలత కూడా ప్రాణస్నేహితురాలై పోతే............

"ఏవిటోయ్ జానకీ? ఒక్కత్తెవీ ఏవిటి ఈ వీధిన వెళుతున్నావు?" అంది వెనకనుంచి వచ్చిన కల్పలత. జానకి ఉలిక్కిపడి, వెంటనే స్థిమితపడి నవ్వుతూ "ఓ! నువ్వా! మా యిల్లు అవతల వీధిలోనేగా?" అంది. "అదిగో అదే మా ఇల్లు. ఓ మాటురా" అంటూ కల్పలత జానకిని ఆహ్వానించింది. "మరో మాటు వస్తానులే" అంది జానకి. అపుడు జానకి కల్పలత ఇంటికి రాలేదు కాని తర్వాత కల్పలత మాత్రం జానకి యింటికి ఎన్నిమార్లో వచ్చింది. జానకికి అమ్మలేదని తెలిసి అయ్యో పాపం అని విచారించింది. తనకు నాన్నలేడు, జానకికి అమ్మలేదు అనే ఆలోచనతో కల్పలతకి జానకి మీద మరింత ఆప్యాయత పెరిగింది.

"మరో మా రంటూ వాయిదా వెయ్యడానికి వీలులేదు. ఇవాళ మా యింటికి రావలసిందే" అని పట్టుబట్టి ఒక రోజున జానకిని తమ యింటికి తీసుకు వెళ్ళింది కల్పలత. దారిలో నీహజ్బెండు ఉద్యోగమా చదువా" అని అడిగింది. గొంతులో ఏదో అడ్డుపడినట్లయి చాలా సేపటివరకూ మాట్లాడ లేక పోయింది జానకి. కాస్సేపాగి తనే "చదువే అయి

ఉంటుందిలే - ఉద్యోగం చేస్తూంటే నిన్నికక్క డెందుకుంచు తాడు - అయితే ఏం చదువు తున్నాడు?" అంది కల్పలత. చాలా ఇబ్బంది పడింది జానకి. కల్పలతకి నిజం చెప్పేద్దాం అనుకొంది జానకి. కాని తిరిగి కల్పలతే "ఆ.... ఏవై ఉంటుందిలే - ఇంజనీరింగో, ఎమ్. బి. బి. యస్సో - ఏం అంతే కదూ? ఎమ్. బి. బి. యస్సా?" అంది. జానకి యాంత్రికంగా తల ఊపింది.

"అమ్మా మా ఫ్రెండ్ జానకి వచ్చిందే!" అంటూ కల్పలత హాల్లోకి వెళ్ళి పోయింది కాని జానకి మాత్రం వీధి గది గుమ్మం దగ్గరే ఆగి పోయింది గదిలో కూర్చుని పేపరు చదువుతూన్న ఆయువకుణ్ణి చూసే సరికి ఎప్పుడూ లేంది తన హృదయానికింత గగుర్పాటు కలిగిందేవిటి? అనుకొంది. అడుగు కదపి ముందుకు వెయ్యలేక పోయింది జానకి రెప్ప వేయకుండా అతణ్ణే చూస్తూ అమట్టునే ఉండి పోయింది.

పేపరు టేబిల్ మీద పడేస్తూ ఇటు తిరిగిన ఆ యువకుడికి, తనని తేరిపార చూస్తూన్న జానకిని చూసేసరికి ఆశ్చర్యం ఆనందం, ఆలోచనా, అన్నీ ఒక్కసారి ముంచుకొచ్చాయి

ఇంతలో కల్పలత వెనక్కి వచ్చి "ఏమిటి జానకీ ఆ మట్టునే నిలబడి పోయావు?.... రా లోపలికి రా....ఓ అన్నట్లు చెప్పలేదు కదూ? వీడు మా అన్నయ్య శేఖర్, ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాడు" అని గదిలో

ఉన్న యువకుణ్ణి పరిచయం చేసింది. 'శేఖర్! ఇంజనీరింగ్' అని మనస్సులో నిశ్శబ్దంగా ఒకటి రెండు సార్లు అనుకొని కళ్ళుమరింత పెద్దవి చేసి అతని కేసి చూసింది జానకి. శేఖర్ ప్రయత్నంగా క్రాఫ్‌ని ఒకచేత్తో సద్దుకొని ఇబ్బందిగా నిలబడ్డాడు. జానకి ఇంకా ఇంకా చాలా సేపు తన ఎదురుగా ఉంటే బాగుండు నను కుంటూ.

అమ్మా, చెల్లెలూ, ఆ అమ్మాయీ మాట్లాడు కుంటూన్నంత సేపూ ఏదో పెద్దపని ఉన్నట్లు హాల్లోనే ఒక పక్కనున్న అలమార్లో ఇటు పుస్తకాలటూ అటు పుస్తకాలిటూ సర్దుతూ కాలక్షేపం చేయసాగాడు శేఖర్.

"జానకికి మన ఊరు రాకముందే పెళ్ళి అయిందటమ్మా-హజ్బెండ్ మెడిసన్ చదువుతున్నాట్ట" అని చెల్లెలు అమ్మతో అంటుండగా వినిన శేఖర్, మనస్సంతా ఏదో పోగొట్టుకున్నట్లు వెలితి అయిపోగా, చెప్పులు తొడుక్కుని విసురుగా వీధిలోకి వెళ్ళి పోయాడు.

"తన చూపులతనికి గుచ్చుకున్నాయో లేదో కాని అతని చూపులు మాత్రం తన మనస్సుని గిలిగింతలు పెట్టాయి. తన హృదయంలో చిగురించిన కోరిక అతనికి తెలియ పరచడం ఎలా?" అని జానకి నెల రోజులుగా తికమక పడుతోంది, ఆరోజునుంచీ.

రోజులు గడుస్తున్నాయి.

ఒక రోజు నాన్నగారు జానకి దగ్గరకు వచ్చి "ఇవాళ నిన్ను చూడడానికి నెల్లూరు నుంచి పెళ్ళివారు వస్తున్నారు. మన గుమస్తాతో చెప్పారట. అవతల వీధిలో వాళ్ళ చుట్టాలింట్లో పొద్దుటదిగి సాయంత్రం పెళ్ళిచూపులకి వస్తాం అన్నారట ఈ పాటికి అక్కడికివచ్చి ఉంటారు. పళ్ళూ పువ్వులూ అన్నీ తెస్తాను. నువ్వీలోగా తయారవు. ఏదో ఈ సంబంధం కుదిరితే-కుర్రాడు కూడా మెడిసన్ చదువుతు న్నాడు.... ఏదో.... అంతా ఆ భగవంతుడిదయ" అంటూ చెప్పారు.

జానకి గతుక్కుమంది. ఇంత హఠాత్తుగా ఇంత ఇబ్బందిలో పడుతాను అని అనుకో లేదు. అనుకుంటే, ఇంతక్రితమే చెప్పి ఉండును శేఖర్‌ని చేసుకుంటానని. ఇప్పుడెలాగా? తనతో మాట వరసకైనా అనకుండా నాన్న పెళ్ళివారిని పిలిచేశారే?. తీరా వాళ్లు వచ్చేశాక తను ఇంక ఏం అంటే ఏం లాభం? భగవంతుడిదయ ఉంటే ఆ పెళ్ళి కొడుక్కి తను నచ్చకుండా ఉండాలి-అదొక్కటే మార్గం ఈ సంబంధం తప్పి పోవాలంటే" జానకి మనస్సా దేవుడికి నమస్కరించింది.

పెళ్ళివారు వస్తారని అన్నీ సిద్ధంచేసి దిగులుగా ఎదురు చూస్తున్న జానకికి వీధివరండా లోంచి నాన్నగారు వేస్తూన్న పెద్ద పెద్ద కేకలు వినిపించాయి.

"ఏమిటి? నా కూతురికి ఇంతకిృతమే పెళ్ళయిందా? కుర్రాడు ఎం. బి. బి. ఎస్. చదువుతున్నాడా? అవతల వీధిలో ఉన్న వాళ్ళ చుట్టాలు చెప్పారా? పెళ్ళి అయిన పిల్లని పెళ్ళిచూపులు చూచుకోవడం ఏమిటని వాళ్ళు తిరిగి రైలుకి వెళ్ళిపోతూ, పెళ్ళి చూపులకి రండని పిలవడానికి వెళ్ళిన నిన్న నానా మాటలూ అన్నారా? ...అసలు నా కూతురికి పెళ్ళి అయిందనే ఈ పుకారు ఎవరు లేపారు? ఎవరు వాళ్లు? ఎవరో కిట్టనివాళ్ళు ఏదో చెప్తే అది విని పెళ్ళి పోవడమేనా? అందులోని నిజానిజాలెంత ఉన్నాయో నన్ను వచ్చి అడగక్కర్లేదూ? ఇదేనా పెద్దమనిషి తరహా!"

జానకికి గుండెలో రాయి పడింది. తను ఒక సమస్య పరిష్కరించుకొనడం కోసం, ఈకుత్తికంటూ, పెళ్ళీ, కథా, ఇదంతా అల్లితే, ఇది మరో సమస్యని సృష్టించిందా? ఓ సమస్యా పరిష్కారం మరో సమస్యకి దారి తీసిందా? ఇప్పుడెలాగా?

తర్వాత నాలుగు రోజులికి ఆవేదనతో కల్పలత కన్పించినదే తడవుగా, జానకి జరిగిందంతా చెప్పుకుని కళ్ళనీళ్ళు పెట్టుకోబోతే, కల్పలత కళ్ళు పెద్దవిగాజేసి చూస్తూ ఆశ్చర్యంతో "వ్హాట్? నీకు నిజంగా పెళ్ళి కాలేదూ? అరే-పొరబాటయింది -అయితే ఆ పెళ్ళి తప్పించి నందుకు నీ పెళ్ళి బాధ్యత నామీద వేసు కుంటాను-సరా?" అంది.

అన్నపత్రికారం వారం తిరక్కుండా అన్నయ్యనీ, అమ్మనీ ఒప్పించి, జానకి పెళ్ళి శేఖర్‌తో ఏర్పాటు చేయించింది కల్పలత.

పెళ్ళిలో జానకి మెడలో తాళిబొట్టు కడుతూ "కుత్తి కంటు నువ్వే కట్టుకుని సగం శ్రమ తగ్గించావు నాకు" అన్న శేఖర్ మాటలకి, జరిగిందంతా జ్ఞాపకంవచ్చి, ఒక్కమారు భయంతో వణికి పోయినా, ఓరగా చూసిన అతని చిలిపి చూపులికి నిలువెల్లా పులకించిపోయి ఎంతో సేదదీరింది జానకి. అతని చూపులికి సమాధానంగా చిరునవ్వులు రువ్వింది.

(విశ్వరచన)